క్లుప్తంగా

రక్షణ గోడలు శిథిలం



పురుషోత్తపురం రహదారిలో శిథిలమైన రక్షణగోడ

సరుబుజ్జిలి: మండలంలోని పలు గ్రామాల్లోని రోడ్లపై నిర్మించిన బ్రిడ్జీల రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. బప్పడాం, ఏఎల్‌నగరం, పురుషోత్తపురం, సవళాపురం జంక్షన్ల వద్ద గల ఆర్‌అండ్‌బీ రహదారి రక్షణ గోడలు ప్రమాదస్థితిలో దర్శనమిస్తున్నాయి. ఆదమరిచి ప్రయాణిస్తే ప్రమాదాలబారిన పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

షట్టర్లు బాగు చేయాలి



మతలబుపేట సమీపంలోని ఓపెన్‌హెడ్ చానల్‌లో పనిచేయని షట్టర్

సరుబుజ్జిలి: వంశధార కుడి ప్రధాన కాలువతోపాటు పిల్ల కాల్వలకు సంబంధించిన షట్టర్లు పనిచేయడం లేదు. దీంతో సాగునీరు సక్రమంగా ఆయకట్టుకు అందక ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు వాపోతున్నారు. షట్టర్లు సక్రమంగా లేక అత్యవసర పరిస్థితుల్లో సాగునీటిని నిల్వ చేయలేక పోతున్నామంటున్నారు. అలాగే నీటిని మళ్లించడానికి కూడా వీలుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు కూడా వృథాగా పోతుందని చెబుతున్నారు. అధికారులు స్పందించి షటర్లను బాగు చేయించాలని కోరుతున్నారు.

రుతుస్రావంపై అవగాహన



మహిళా సంఘాల ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: రుతుస్రావంపై అవగాహనతోనే మహిళల ఆరోగ్యం మెరుగుపడుతుందని మెప్మా అధికారిణి పి.విజయకుమారి అన్నారు. ఈ నెల 28వ తేదీన అంతర్జాతీయ రుతుస్రావ దినోత్సవం సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో స్థానిక స్వయం సహాయక సంఘాల సభ్యులకు క్షేత్రస్థాయిలో ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆధునిక జీవనశైలిలో ఇప్పటికీ రుతుస్రావ సమస్యలపై అపోహలు, మూఢనమ్మకాలు సరికాదన్నారు. ఈ విషయమై యవ్వన దశలోనే మహిళలకు ఆరోగ్య అవగాహన అవసరమన్నారు. రుతుస్రావ సమస్యలపై మహిళలు మేల్కొంటేనే ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందగలరని సూచించారు. కార్యక్రమంలో స్థానిక మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు



ఎల్.ఎన్.పేటలో భద్రపరిచిన పుస్తకాలు

ఎల్.ఎన్.పేట: మండలానికి పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఎంఈవో ఎన్.శ్రీనివాస్ తెలిపారు. జగనన్న విద్యా కానుక కిట్లకు అవసరమయ్యే సామగ్రితో పాటు 8,361 పాఠ్యపుస్తకాలు వచ్చినట్టు చెప్పారు. రెండో విడతలో మరికొన్ని పాఠ్యపుస్తకాలు రావలసి ఉందన్నారు. ఇప్పటి వరకు వచ్చిన జేవీకే కిట్లతో పాటు పాఠ్యపుస్తకాలను అన్ని పాఠశాలలకు జూన్ నెల మొదటి వారంలో చేరవేస్తామన్నారు.

పుస్తక పఠనంపై అవగాహన



పిల్లలకు కథలు చెబుతున్న రిటైర్డు టీచర్ శ్రీనివాసరావు

హిరమండలం: చిన్నతనం నుంచి పుస్తక పఠనం అలవర్చుకోవాలని స్థానిక గ్రంథాలయ అధికారిని కె.ఎర్రమ్మ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయలంలో వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పిరాచర. కథలు పుస్తకాలు, మహనుభావుల జీవిత చరిత్రలు, రంగవల్లులు, క్విజ్, డ్రాయింగ్, ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు ఉన్నారు.

ఉత్సవ సందడి



హరిసూర్యప్రకాష్‌కు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గ్రామ తిరువీధుల్లో అమ్మవారి పట్టాభి జంగిడి, ఘటాల ఊరేగింపు కార్యక్రమం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. కన్నవారి ఇంటి నుంచి బ్రహ్మణవీధి, ప్రధాన రహదారి మీదుగా యశోదనగర్, సాయినగర్, క్రిష్ణనగర్, మహీంద్రనగర్, హనుమాన్‌నగర్, అచ్చుతాపురంలో ఘటలతో అమ్మవారిని ఊరేగించారు. మహిళలు దారిపొడువునా చీరలు పరిచి అమ్మవారిని ఆహ్వానించారు. పట్టాభి జంగిడి పట్టుకున్న మహిళలకు ముర్రాటలతో అభిషేకాలు చేశారు.

ఆలయాన్ని సందర్శించిన అధికారులు

నీలమణిదుర్గ పెద్దపండుగ ఏర్పాట్లను దేవదాయశాఖ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ ఆదివారం పరిశీలించారు. ఆలయానికి సంబంధించిన విషయాలను ఈవో వాసుదేవరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈవోలు కలిసి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కోటబోమ్మళి ఈవో రాధకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్

నీలమణిదుర్గ అమ్మవారి పెద్దపండుగ సందర్భంగా ఆదివారం ఉదయం అమ్మవారి దర్శినానికి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. సెంటెన్స్ స్కూల్ నుంచి ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి నాలుగు చక్రాల వాహనాలను, ఆటోలను పాతపట్నం పట్టణంలోని పోలీసులు అనుమతి ఇవ్వలేదు. అయినప్పటికీ ద్విచక్ర వాహనాలపై జనం భారీగా రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.



కళాకారుల సందడి



హనుమాన్‌నగర్‌లో అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

నేడు కండక్టర్ ఝాన్సీ డ్యాన్స్

అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రికి గాజువాక కండక్టర్.. పల్సర్ బైక్ డ్యాన్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు ఉత్సవ ప్రధాన కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక ఏఎంసీ కార్యాలయం ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమం ఉంటుందన్నారు.

అలరిస్తున్న ప్రదర్శనలు

ఉత్సవాల్లో భాగంగా ఆల్‌ఆంధ్రరోడ్డు కూడలి వద్ద, యెరుకోల కాంప్లెక్స్ మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. రంగులరాట్నం, బ్రెక్ డ్యాన్స్, తిరిగే రైలు, మిక్కిమౌస్ తదితర ప్రదర్శనలు ఏర్పాటు చేయగా.. వీటిని చూసేందుకు పర్లాకిమిడి (ఒడిశా), పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివస్తున్నారు.



ట్రాఫిక్‌తో నిలిచిపోయిన వాహనాలు



అలరిస్తున్న జెయింట్‌వీల్



బేబీ రైడింగ్‌లో పిల్లలు



బ్రెక్ డ్యాన్స్‌లో యువకులు

భగవద్గీతతో భక్తికి మార్గం

ఆమదాలవలస రూరల్: భగవద్గీతతో భక్తిమార్గం లభిస్తోందని హిందూ జ్ఞాన ప్రచార వేదిక శ్రీకాకుళం కమిటీ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని సొట్టవానిపేట గ్రామంలో ఆదివారం భగవద్గీత అవశ్యకతపై కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. భగవద్గీతతో ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత వంద రకాల గ్రంథాలను విక్రయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు దుర్గారావు, పుండరీకాక్షయ్య, ఈశ్వర్‌లాల, వెంకటరావు, గోపాలకృష్ణ, ప్రశాంతి, స్వాతి, సంతోషి, లక్ష్మి పాల్గొన్నారు.



ధర్మప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

కృష్ణదాస్‌ను కలిసిన దువ్వాడ వాణి



కృష్ణదాస్‌ను కలిసిన దువ్వాడ వాణి, నాయకులు

పోలాకి: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌ను టెక్కలి నియోజకవర్గ నాయకురాలు దువ్వాడ వాణి ఆదివారం మబుగాంలో మర్యాదపూర్వకంగా కలిశారు. టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగిరేలా కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని కృష్ణదాస్ కోరారు. కార్యక్రమంలో టెక్కలి ఎంపీపీ ఎ.సరోజనమ్మ, నాయకులు టి.జానకీరామయ్య, పి.రవికుమార్‌రెడ్డి, కె.ధర్మారావు, ఎస్.రామిరెడ్డి, జి.మోహన్‌రెడ్డి, బి.ఉదయ్, పి.శ్రీనివాస్,ఆర్.మురళి, కె.కామేష్, ఎన్.శంకర్, కె.అప్పన్న, బి.శ్రీను పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

నరసన్నపేట: అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ప్రారంభమైంది. ఎనిమిది రోజులు జరగనున్న టోర్నీలో 16 జట్లు పాల్గొంటున్నాయి. టోర్నీని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గుప్త ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రమశిక్షణతో క్రీడాకారులు వ్యవహరించాలన్నారు. క్రీడాకారులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. పరిమిత 20 ఓవర్ల చొప్పున పోటీలు జరుగుతున్నట్టు పేర్కొన్నారు. తొలిరోజున రెండు మ్యాచ్‌లు జరిగాయి. దీంట్లో నరసన్నపేట సబ్‌సెంటర్–పాలకొండ జట్ల మధ్య మొదటి పోటీ జరగ్గా పాలకొండ విజయం సాధించినట్టు నిర్వాహకులు నక్క రాము, డేవిడ్‌లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం ఎస్ఎస్ఆర్ అకాడమి శ్రీకాకుళం– జానీ లెవెన్ నరసన్నపేట జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ఎస్ఎస్ఆర్ అకాడమి జట్టు విజయం సాధించింది.



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

వృద్ధాశ్రమానికి రూ.25 వేల వితరణ

హిరమండలం: హిరమండలంలోని ప్రేమసాయి వృద్ధాశ్రమ అభివృద్ధికి నరసన్నపేట గ్రామానికి చెందిన డాక్టర్ యు.సన్యాసిరావు తనవంతు సాయాన్ని అందించారు. 25 వేల రూపాయలను ఆశ్రమ కోఆర్డినేటర్ ఎస్.సాయిబాబాకు ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా ఆశ్రమ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హిరమండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అందవరపు వెంకట బుచ్చిబాబు, ఆశ్రమ అభివృద్ధి కమిటీ సభ్యులు బి.సురేష్ ఉన్నారు.



సాయాన్ని అందజేస్తున్న సన్యాసిరావు

ఖరీఫ్ పనుల్లో రైతులు బిజీ



ఎల్.ఎన్.పేటసుమంతాపురం వద్ద నారుమడి దుక్కి చేస్తున్న రైతు



ఆమదాలవలస రూరల్: చెవ్వాకులపేట వద్ద పొలం గట్లను చదును చేస్తున్న రైతులు

ఎల్.ఎన్.పేట/ఆమదాలవలస రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. మండువేసవిలో కూడా వర్షాలు కురవడంతో పొలాలను దుక్కు చేస్తున్నారు. వరినారు మండులను సిద్ధం చేస్తున్నారు. ఎల్.ఎన్.పేట మండలం సుమంతాపురం, బరటాం, ముంగెన్నపాడు, కోవిలాం, రావిచెంద్రి, కుశమలపాడు, జాడుపేట, ఫాక్సుదొరపేట, యంబరాం, గొట్టిపల్లి, కొమ్ముపలస, ఆమదాలవలస మండలం జొన్నవలస, చిట్టివలస, సైలాడ, రామచంద్రాపురం, తొగరాం, దూసి, కొత్తవలస, చీమలవలస, చెవ్వాకులపేట, కొర్లకోట గ్రామాలకు చెందిన రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

చిన్నకిట్టాలపాడులో గ్రామదేవత సంబరం

సారవకోట: మండలంలోని చిన్నకిట్టాలపాడు గ్రామంలో ఆదివారం నుంచి గ్రామదేవత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలను ఉజ్జిడిబండి కి తిరువీధి నిర్వహించి ప్రారంభించారు. సోమవారం నీలమణి, ఉజ్జయిని దేవీ ఆలయాలలో పూజలు, మంగళవారం ఘటాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

వలంటీర్ పోస్టులకు నోటిఫికేషన్

సారవకోట: మండలంలో ఖాళీగా ఉన్న ఆ వలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీవో విశ్వేశ్వరరావు తెలిపారు. దీంట్లో సారవకోట క్లస్టర్ 12 ఎస్సీ మహిళకు, లక్ష్మీపురం క్లస్టర్ 7, 9 బీసీ పురుషలకు, కూర్మనాథపురం క్లస్టర్ 5 బీసీ పురుషలకు, రామకృష్ణాపురం ఓసీ మహిళకు, కిడిమి ఓసీ పురుషులకు కేటాయించినట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ నెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోండి

కొత్తూరు: ఖరీఫ్ సీజన్ కోసం వరి విత్తనాలు కావల్సిన రైతులు ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో శ్రీనివాసరావు తెలిపారు. ఏరకం విత్తనం అవసరమో గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న వారికి మాత్రమే విత్తనాలను అందజేస్తామన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మెళియాపుట్టి: పెద్దలక్ష్మీపురం గ్రామానికి చెందిన బుడత అప్పలనరసమ్మ (46) చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. అనారోగ్యంతో నెలరోజుల క్రితం చాపర పీహెచ్‌సీకి వెళ్లగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కి రిఫర్ చేశారు. అయితే చికిత్స పొందుతున్న ఆమె బెడ్‌మీద నుంచి కిందకు పడిపోవడంతో తలకు తీవ్రగాయమై రక్తస్రావమైంది. అక్కడి వైద్యులు శస్త్రచికిత్స చేసి, విశాఖ వెళ్లాలని సూచించారు. అయితే విశాఖ వెళ్లకుండా ఇంటికి వెళ్లిపోయారు. ఈనెల 24న మళ్లీ రిమ్స్‌కి వెళ్లారు. గతంలో వైద్యులు పరిశీలించి విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ రాయడంతో కుటుంబసభ్యులు అక్కడకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందినట్టు పోలీసులు చెప్పారు.

భానుడు భగ.. భగ

ఆమదాలవలస రూరల్: ఎండలు మళ్లీ మండిపోతున్నాయి. రెండు రోజులుగా భానుడు భగభగ మండిపోతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రెండు రోజుల క్రితం వరకు అల్పపీడన ద్రోణితో చల్లబడిన వాతావరణం ఇప్పుడు సెగలు కక్కుతుంది. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ తీవ్రత పెరిగి ఉక్కపోత మొదలవుతుంది. ఉదయం 11 గంటలకే జనసంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.

కవి పొన్నాడకు ఎన్టీఆర్ పురస్కారం ప్రదానం



పొన్నాడను సత్కరిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: ప్రముఖ కవి, సాహితీ వేత్త ఆమదాలవలసకు చెందిన పొన్నాడ వరాహ నరసింహులుకు ఎన్టీఆర్ పురస్కారం వరించింది. బెంగళూరుకు చెందిన సీపీ బ్రౌన్ సేవాసమితి, స్వాతంత్ర్య సమర యోధులు ఇడమకంటి బ్రహ్మారెడ్డి ధార్మిక మండలి, లక్ష్మీరెడ్డి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు శతక రచన పోటీల్లో పీవీఎన్ మాస్టారు రచించిన నందమూరి శతకం ఎంపికైంది. దీంతో బెంగళూరులోని సుబ్బరామిరెడ్డి ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పొన్నాడను సత్కరించి అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహక ప్రతినిధులు రాధాకృష్ణ రాజు, వేటూరి ఆనంద్, బండి ఆదినారాయణ రెడ్డి, విశ్వసాహితీ ఉపాధ్యక్షులు కర్ణేన జనార్దానరావు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



పొందూరు: పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

పొందూరు: లోలుగు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997–98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. 25 ఏళ్ల తరువాత అందరూ తమ పాఠశాలలో కలుసుకొని సందడి చేశారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకొని మధురానుభూతి పొందారు. చదువు నేర్పిన ఉపాధ్యాయులతో తమ ఆనందాన్ని కలిసి పంచుకున్నారు. మధుర గీతాలతో, డ్యాన్సులతో, కేరింతలతో సభా ప్రాంగణాన్ని రసమయం చేశారు. నాటి ప్రధానోపాధ్యాయుడు మీసాల సూర్యనారాయణ, ప్రస్తుత హెచ్ఎం ఎ.సంజీవరావు, ఉపాధ్యాయులు వెంకటరావు, జగన్నాథం, శ్రీధర్, క్రిష్ణారావు, కొండలరావు, బసయ్య, నందికేశ్వరరావు, మల్లేశ్వరరావు తదితరులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం గ్రూపు ఫొటో తీసుకున్నారు.



జలుమూరు: ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

జలుమూరు: శ్రీముఖలింగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995 – 96 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వవిద్యార్థులు ఒకే వేదికపై ఆదివారం కలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించి గౌరవించారు.

సకాలంలో సమగ్ర భూమి సర్వే

ఎల్.ఎన్.పేట: సమగ్ర భూమి రీసర్వేను సకాలంలో పూర్తి చేయాలని తహసీల్దారు బి.ఎస్.ఎస్.సత్యనారాయణ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో భూముల రీసర్వేపై రెవెన్యూ సిబ్బంది, గ్రామ సచివాలయ సర్వేయర్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 47 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఇప్పటికే 36 గ్రామాల్లో భూసర్వే పూర్తయిందన్నారు. మిగిలిన 11 రెవెన్యూ గ్రామాల్లోను డ్రోన్ సర్వే పూర్తయిందని మ్యాప్ పాయింటింగ్ వచ్చిన తరువాత ఫీల్డ్ సర్వే పూర్తి చేస్తామన్నారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దు రాళ్లు పాతేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైతులకు పట్టాదారుపాస్ పుస్తకాలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య పాల్గొన్నారు.

పశుబీమాతో పాడి రైతులకు లబ్ధి

ఆమదాలవలస రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న పశుబీమాను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కొత్తవలస పశువైద్యాధికారి ఓంకార్ అన్నారు. కొత్తగా ప్రారంభించిన పశుబీమా పథకంలో ఎస్సీ, ఎస్టీ రైతులు 20 శాతం, తెల్లరేషన్‌కార్డు ఉన్న రైతులు 50 శాతంతో ఈ పథకం నమోదు చేసుకోవాలని సూచించారు. పశువులు, గొర్రెలకు ప్రమాదవశాత్తు, వివిధ వ్యాధుల వలన మరణిస్తే సంబంధిత పాడి రైతులకు నష్ట పరిహారం అందుతుందన్నారు. రైతులు తమ వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా శరత్‌బాబు

కవిటి: జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కవిటి పట్టణానికి చెందిన తుంగాన శరత్‌బాబు ఖేలో ఇండియా షటిల్ బ్యాడ్మింటన్ జాతీయస్థాయి పోటీలకు అంపైర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం కవిటిలో జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది తమరాల జయరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 3 వరకు ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జరగనున్న జాతీయస్థాయి ఖేలో ఇండియా పోటీలకు శరత్‌బాబు ఎంపిక కావడానికి కృషిచేసిన రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు, జిల్లా సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మజ్ఞానమే ముక్తికి మార్గం

శ్రీకాకుళం కల్చరల్: ఆత్మజ్ఞానమే ముక్తికి మార్గమని వక్త రంగడు ప్రసాదరావు అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో ఆదిశంకరాచార్యులు రచించిన వివేక చూడామణిలోని పలు అంశాలపై ఆదివారం ప్రసంగించారు. నిరాకారం, నిస్సంగమైన ఆత్మలో కూడా వస్తుమయ ప్రపంచం లేదని వివరించారు. కార్యక్రమంలో మండుల మోహనరావు, పతంజలిశాస్త్రి, కె.వి.ఎస్.స్వామి, ఈశ్వరరావు, తవుడు, విశ్వేశ్వరరావు, అప్పారావు, నరసునాయుడు, బాబారావు, ఎన్.నరసింహమూర్తి, సరస్వతి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.